# దొంగ దొరికితే?!

కందుకూరి వెంకట మహాలక్ష్మి




**డోర్ బెల్ నొక్కడం - రేవతి తలుపు తియ్యడం - "హాయ్ రేవతీ!" అంటూ రోహిణి, "నేనీ ఊళ్ళో వున్నానని నీకెలా తెలిసిందే" అంటూ ఆశ్చర్యపోతూ రేవతి - ఒకరినొకరు ఆనందంతో చుట్టుకుపోవడం సెకనుల్లో జరిగిపోయింది. అలా కౌగలించుకునే రేవతి రోహిణిని లోపలికి తీసుకెళ్ళి కుర్చీలో కూర్చోబెట్టింది.**

కూర్చున్న రోహిణి రేవతి వీపు మీద ఒక్కటి చరుస్తూ "ఏమే దొంగ పీనుగా! నాలుగు నెల్లనుంచి ఈ ఊళ్లో వుండి, నేనున్నానని తెలిసి నన్ను కలుసుకోకుండా ఎలా వుండగలిగావే?! నీ ఎడ్రస్ ఎలా సంపాదించానని ఆశ్చర్యపోతున్నావా? మొన్న హైదరాబాద్ కెళ్ళినప్పుడు షాపింగ్ కని వెళ్తే ఓ షాపులో మీ అమ్మగారు కనబడ్డారు. మాటల్లో నీ గురించి అడిగితే, మీ వారికి ఢిల్లీ బదిలీ అయిందని చెప్తే నేను ఆంటీ దగ్గర నీ అడ్రస్ తీసుకున్నాను.

నేను నీలా కాదు తెల్సా! నిన్న ఊరినుంచి వచ్చానా - నిన్ను చూడాలని మనసు కొట్టుకోవడంతో, వుండలేక ఈ రోజు అరపూట సెలవడిగి నీ అడ్రస్ వెతుక్కుంటూ వచ్చాను. నీకూ, నాకూ ఎంత తేడానో చూడు! పెళ్ళయ్యాకే మారిపోయావనుకో.

అవును గానీ మీ ఆయన ఏ బ్రాంచిలో పని చేస్తున్నారుట? ఆంధ్రా బ్యాంకే కదా! సరే గానీ మీ ఆయన ఎలా వుంటారు? ఎలాంటి వాడే? నీ కెన్ని సంబంధాలు వచ్చినా తీసిపారేసేదానివి కదా! డాక్టర్ సంబంధమొస్తే బాబోయ్! చుట్టూ నర్సులుంటారు మంచి వాడు కాకపోతే!? అనే దానివి. పైలెట్ సంబంధమొస్తే, అమ్మో! ఎయిర్ హోస్టెస్‌లు మిస్‌లు - బుద్ధి మంచిది కాకపోతే? అనే దానివి. ఆర్మీ ఆఫీసరొస్తే, బార్డర్ ఏరియాలో ఒక్కళ్ళూ ఉన్నప్పుడు ఏం పాడు బుద్ధిపుట్టినా నా గతేమిటి? అన్నావు. అందంగా వుంటే ఆఫీసుల్లో ఆడవాళ్ళు మీవారి చుట్టూ తిరిగి మనసు మార్చొచ్చు! అనే దానివి. మరి అన్ని సంబంధాలని తోసిపుచ్చావు. ఇప్పుడు శ్రీరామచంద్రమూర్తినే కట్టుకున్నావా? నువ్వు కోరిన వ్యక్తేనా? సరే అలాంటివాడే దొరికాడని వేరే చెప్పాలా తల్లీ! నీ సంగతి నాకు తెలీదా! ఒకటో క్లాసునుంచీ డిగ్రీదాకా కలిసి చదివాం కదా!

అవును గానీ - ఒకే ప్రాణంలా కలిసి తిరిగాం కదా! శ్రీవారు రాగానే నన్ను మరిచిపోయి, కొత్తలో రెండు మూడు ఉత్తరాలు రాసి మానేస్తావా? అయ్యో నా ప్రాణ స్నేహితురాలు ఫారిన్‌లో వుండిపోయి పెళ్ళికి రాలేకపోయింది. దానికి ఒక్క ఫోటోముక్క పంపిద్దాం అనయినా అని పించిలేదా!" అంటూ ఏ ప్రశ్నకి సమాధానమివ్వనివ్వకుండా వసపోసిన పిట్టలా ప్రశ్నలేసేస్తున్న రోహిణిని చూసి నవ్వుతూ, "కాస్త ఆగవే తల్లీ! నన్ను కూడా మాట్లాడనీ - ఇంతకీ మావారి గురించేనా నీ సందేహా లన్నీను! నేను కోరుకున్నలాంటి వ్యక్తే నాకు భర్తగా ఆనంద్ లభించాడు. ఎంతో అదృష్ట వంతురాలిని. బుద్ధికి శ్రీరామచంద్రుడే, రూపానికి బిలో ఏవరేజ్. ఉద్యోగం సామాన్య మైంది. బ్యాంకులో క్లర్కు. జల్సాగా ఆడాళ్ళతో తిరగడానికి డబ్బూలేదు, ఆడవాళ్ళని ఆక ర్షించుకునే అందమూ లేదు. అదే నా కోరిక కానూ! నీ ప్రశ్నలకి జవాబులు చాలా? మరి కూర్చో కాఫీ, టిఫిన్ చేసి తెస్తా!" అంటూ లోపలికెళ్లింది రేవతి.

ఏమీ తోచని రోహిణి రేవతి ఇల్లంతా తిరిగి ఆమె సామానంతా చూడసాగింది. రేవతి

రూంలో గోడనున్న దంపతుల ఫోటోనే చూస్తూ నిలబడ్డ రోహిణిని "ఎక్కడున్నావే? కాఫీ తాగుదాంరా!" అని పిలవగానే హాల్లోకెళ్లింది. చిన్ననాటివి, ఆ తరవాతవి కబుర్లయ్యాక వెళ్తూ. వెళ్తూ ఎల్లుండి మధ్యాహ్నం భోజనానికి రమ్మని రేవతిని పిల్చి ఇంటికి బయలుదేరింది రోహిణి.

* * *


"ఏమిటి రోహిణీ! ఎప్పటి నుంచో కోరుతున్న కోరిక తీరుస్తానని, హోటల్‌కి వద్దు, ఇంట్లోనే నేనుండేది ఒక్కర్తినే అక్కడయితే రెండో కంటికి తెలీదన్నావు. మరి లోపల వంటింట్లో ఎవరో వున్నట్లున్నారేమిటి?"

"అబ్బే ఎవ్వరూ లేరు - మీకు మైసూర్‌పాక్ యిష్టమని చెప్పారు కదా? నా ఫ్రెండొకామె బాగా చేస్తుంది. వచ్చి కాస్త చేసి వెళ్ళమన్నాను. కాస్సేపట్లో వెళ్ళిపోతుంది. ఆ తరవాత మనిద్దరమే! ఏకాంతం - హాయి హాయి." అంటూ "ఒసేయ్! మా ఫ్రెండ్ కం కొలీగ్ వచ్చారే! ఆయనకి నేనంటే ప్రాణం. త్వరలో మేం వివాహం చేసుకోబోతున్నాం. అవునూ - మైసూర్‌పాక్ అయితే పట్రా!" అన గానే మైసూర్‌పాక్ ప్లేట్‌తో హాల్లోకి అడుగెట్టిన రేవతిని ఆనంద్, ఆనంద్‌ని రేవతి చూసుకుని షాక్ కొట్టినట్లు వణికిపోసాగారు. దొరికి పోయిన దొంగల్లా ఇద్దరూ సిగ్గుతో తలలు దించుకున్నారు.

"క్షమించు రోహిణీ! కట్టుకున్న భర్తని వీధిని పెట్టుకోలేక అబద్ధాలతో సమర్థించుకునే భార్యల కోవలోకి చేరి నీతో మావారి గురించి ఎంతో గొప్పగా చెప్పాను. మన దేశంలో ఎందరో స్త్రీలు నాలాగే నిజాన్ని కప్పెట్టుకుని ఎదుటి వారిని మభ్యపెడుతూ జీవితంలో సర్దుకుపోతున్నారు." అంటూ కళ్ళ నీళ్ళెట్టు కుంటున్న రేవతిని జాలిగా చూస్తూ అక్కున జేర్చుకుంది రోహిణి. "రేవతీ ఆడవాళ్లంతా నువ్వనుకున్నట్లు చెడ్డవాళ్ళుండరు. మగబుద్ధిని అనుకోవాలి" అంది. రోహిణి కావాలని ఆడిన నాటకమని గ్రహించిన ఆనంద్ తేలుకుట్టిన దొంగలా నెమ్మదిగా బైటికి జారుకున్నాడు. ఈ సంఘటనతో ఆనంద్‌కి బుద్ధి వచ్చేలా చెయ్యి భగవాన్! అనుకుంది రోహిణి మనసు లోనే!

*

# మ్యూజిక్ థెరపీ



రమ్యస్మిత - బూరె బుగ్గల్లాంటి అందమైన మోము. కలువ రేకుల్లాంటి చక్రాల్లా త్రిప్పే కళ్ళు, కొనదేలిన ముక్కు. అయితే మాటలు అంత స్పష్టంగా వచ్చేవి కావు. ఎంతో మంది డాక్టర్లకి చూపించారు. అయితే సరియైన మందులు ఇవ్వలేకపోయారు. క్లాసు రూమ్‌లో పిల్లలు వేళాకోళంతో ఆటపట్టించేవారు. అయితే రమ్యస్మిత పేరుకు తగ్గట్టు ఎప్పుడూ నవ్వుతూ ఉండేది. మంచి స్పీకర్ అవ్వాలని తల్లి కోరుకుంటూ ఉండేది. ఆగి ఆగి చెప్పే మాటలు చిన్నతనంలో సరదాగా ఉన్నా వయస్సు వచ్చేటప్పటికి ఇబ్బంది అవుతుందని తల్లికి తెలుసు. అందుకే ఆమె చేత స్పీడ్‌గా అంకెలు, ఎక్కాలు, పదాలు చెప్పిస్తూ ఉండేది. ఇది కాదు దీనికి సరైన రెమిడీ చూడాలని ఆలోచించింది. తులసి ఆకులు తినిపించింది.

ఒకసారి ఒక సినిమాలో పాట అనర్గళంగా పాడటం విని తల్లికే ఆశ్చర్యమేసింది. ఓహో తన కూతురికి క్యాసెట్ పెట్టి మరీ నాలుగైదు పాటలు నేర్పించింది. దానితో మాటలు కొంచెం స్పష్టంగా వచ్చాయి. మరి కాసేపు ఆలోచించి ఒక మంచి సంగీతం మాస్టారి వద్ద విద్య మొదలు పెట్టించింది.

రమ్య స్వరాలు పాడుతుంటే చాలా స్పష్టంగా, శ్రావ్యంగా వచ్చేది. ఆ పాటలు ఎంతో మధురంగా వినిపించేవి. క్రమ క్రమంగా సంగీత సాధనలో మూడేళ్ళు గడిచింది. రమ్య ఐదవ తరగతిలోకి వచ్చింది. ఆమె గొంతులో శ్రావ్యత వచ్చింది. రమ్యను క్రమక్రమంగా రోజుకి ఎనిమిది గంటలు సాధనలో ఉంచేది తల్లి. రమ్యకు ఇప్పుడు ఆటలకంటే మాటల కంటే పాటలతో - తన ప్రతిభను ఎక్కువ చూపిస్తున్నది. రమ్యకు స్కూలుకి వెళ్ళడం, చదువుకోవడం, పాటలు పాడుకోవడం. ఒకప్పుడు అందరిచేత విమర్శించబడిన రమ్య, ఇప్పుడు అందరిచేత ప్రశంసలు పొందుతోంది. తనకే కాకుండా తన తల్లి తండ్రులకి కూడా మంచి పేరు సంపాదించి పెట్టింది.

రమ్యకు స్కూలులోనే ప్రైజులు కాక, జిల్లా స్థాయి రాష్ట్రస్థాయి ప్రయిజు కూడా సంపాదించింది. క్రమక్రమంగా పదాలు స్పష్టంగా పల్కడం, సంస్కృత మాటలతో పద్యాలు పాటలు పాడటం ద్వారా రమ్య కంఠం సవరించబడింది. అది మామూలుగా అయ్యింది. పాటల పోటీల్లో ప్రైజులు పొందిన రమ్య కాలేజీ స్థాయికి వచ్చి కచ్చేరీలు చేయడం ఆలిండియా రేడియోలో పాడటం వరకూ వచ్చింది. బంధువులకి ఇది కొంచెం ఈర్ష్యగానే ఉండేది. అయితే పిల్లని తల్లి ఎక్కడికీ పంపక జాగ్రత్తగా కాపాడుకుంటూ వచ్చింది. గొంతుకి కావాల్సిన రక్షణ కల్పిస్తూ పిల్ల పురోగతికి తల్లి తండ్రి కూడా కృషి చేశారు.

క్లాసికల్ సంగీతంలో ఉన్నత శిఖరాలు అధిరోహించడమే తన జీవిత ధ్యేయమని ఏ.ఐ.ఆర్ ఇంటర్వ్యూలో రమ్య ఇచ్చింది. ఫ్యూచర్‌లో బి.ఎ మ్యూజిక్, ఎం.ఏ మ్యూజిక్ చేసి డాక్టరేట్ చేసి, ఎందరికో మ్యూజిక్ థెరపీ చెయ్యాలన్నదే తన జీవిత లక్ష్యం అన్నది. టెన్త్ చదివే వయస్సులోనే ఇంత మెంటల్ మెచ్యూరిటీ రావడం అన్నది కేవలం మ్యూజిక్ థెరపీ వల్ల వచ్చిందని, ఆ విధమైన కృషి వల్లనే సాధ్యమని తెలిపింది.

మరి బాలలూ, మీలో కూడా ఎవరికైనా నత్తి ఉంటే మ్యూజిక్ థెరపీ ద్వారా తగ్గించుకోండి. అన్నమయ్య, త్యాగయ్యల్లా కీర్తి పొందండి.

-కె. వాణీ ప్రభాకరి